## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: మండలంలోని మల్లవరం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ జేపీబీ నటరాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాథపురం, మల్లవరం, భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్త గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పేదల ఆర్థికాభివృద్ధికి పీ4 దోహదం



ఎస్.అన్నవరంలో పీ4 కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీధర్

తుని రూరల్: పేదలను ఆర్థిక ప్రగతి వైపు నడిపించడమే పీ4 ప్రధాన లక్ష్యమని తుని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్.శ్రీధర్ అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరంలో బుధవారం ఆయన పర్యటించారు. పీ4 కుటుంబాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తునిలో అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కమిషనర్ వెంకట్రావును ఆదేశించారు. ఎంపీడీఓ కె.సాయినవీన్ పాల్గొన్నారు.

### గంగవరంలో ఉచిత వైద్య శిబిరం

రౌతులపూడి: మండలంలోని గంగవరంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజినీదేవి ఆధ్వర్యంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మంది జ్వర పీడితులను గుర్తించారు. రోగుల రక్త నమూనాలను సేకరించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మురళి, హెచ్‌వీ విజయ, హెల్త్ అసిస్టెంట్ నారాయణమూర్తి, ఏఎన్ఎం షేక్ అనార్కలి పాల్గొన్నారు.

### ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందన్నారు. యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ దాడుల్లో ఆరుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం, ప్రత్తిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు బుధవారం భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. స్టేట్ టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ (మంగళగిరి) ధర్మదత్తు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ జయమౌనిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 30 లీటర్ల సారా, 400 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారు కాగా ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.

### ఏపీజీఈఏ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) ప్రత్తిపాడు యూనిట్ అధ్యక్షుడిగా రౌతులపూడి గ్రామ సర్వేయర్ పైడిమల్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ప్రత్తిపాడు యూనిట్ ఏపీజీఈఏ సంఘ సమావేశం జరిగింది. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు మల్లాడి జగన్నాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతుల రాంబాబు, సంయుక్త కార్యదర్శి భాను ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రత్తిపాడు యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా ప్రధాన కార్యదర్శిగా కొమ్మ రామచంద్ర గణపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్. రవితేజ, కోశాధికారిగా బడే దివాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ రాజశేఖర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు పూలమాలతో సత్కరించారు.

# కనీస వసతులు కరవు

- అరకొర సౌకర్యాలతో ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం
- 1968లో ఎక్సైజ్ సర్కిల్ ఏర్పాటు
- ఇప్పటికీ పక్కా భవనం లేని వైనం



అరకొర వసతులతో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కనీస వసతులు లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ సర్కిల్ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకూ పక్కా భవనాన్ని నిర్మించ లేదు. ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూర్చుతున్న ఎక్సైజ్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించాలన్న ఆలోచన ఆ శాఖ అధికారులకు రావడం లేదు. 1968లో ప్రత్తిపాడు ఎక్సైజ్ రేంజ్ కార్యాలయాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఈ రేంజ్ పరిధిలో ఏలేశ్వరం, అన్నవరం, తుని, ప్రత్తిపాడు కేంద్రాలుగా ఎస్సై స్థాయిలో సిబ్బంది ఉండేవారు. అప్పట్లో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, తొండంగి, కోటనందూరు, కిర్లంపూడి, తుని మండలాలు ఈ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోనే ఉండేవి. సిబ్బంది తక్కువగా ఉండడం, వాహనాల కొరత, రేంజ్ పరిధి ఎక్కువగా ఉండడంతో సారా స్థావరాలపై దాడులు చేసేందుకు సిబ్బంది ఇబ్బందులు పడేవారు.

**1999లో సర్కిల్‌గా విభజించి..**

సిబ్బంది ఇబ్బందుల దృష్ట్యా ఎక్సైజ్ శాఖ కసరత్తు చేసి రేంజ్ కార్యాలయాలను రద్దు చేసింది. ఒక్కో రేంజ్‌ను రెండు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లుగా విభజించి, పరిధిని కుదించారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ రేంజ్‌ని 1999లో ప్రత్తిపాడు, తుని కేంద్రాలుగా విభజించి, ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. రేంజ్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాలను తుని సర్కిల్‌లోకి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, కిర్లంపూడి మండలాలలతో పాటు నూతనంగా ఏర్పాటైన రౌతులపూడి మండలాన్ని ప్రత్తిపాడు సర్కిల్‌లోకి చేర్చారు.

**అద్దె భవనంలోనే..**

ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ అరకొర వసతుల మధ్య అద్దె భవనంలోనే కొట్టుమిట్టాడుతోంది. సిబ్బందికి, నిందితులకు అవసరమైన వసతులు లేనేలేవు. ఈ స్టేషన్‌కు రైటర్‌ను ఈనాటి వరకు నియమించలేదు. స్టేషన్‌లో సీఐతో పాటు ఇద్దరు ఎస్సైలు ఉండాలి. ప్రస్తుతం ఒక ఎస్సై పోస్టు ఖాళీగానే ఉంది. దాడుల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండాల్సిందే. ఎండావానల బారిన పడిన ఈ వాహనాలు తుప్పుపట్టి పాడవుతున్నాయి. వాహనాలకు వేలం నిర్వహించే సమయానికి పూర్తిగా పాడైపోయి, కనీస ధర పలకడం కూడా కష్టమవుతోంది. దీంతో వేలాది రూపాయల ఆదాయాన్ని ఎక్సైజ్ శాఖ కోల్పోతోంది.

**ఏటా రూ.11.10 కోట్ల ఆదాయం**

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో 18 వైన్ షాపులున్నాయి. ఈ షాపులకు లైసెన్సు ఫీజుల ద్వారానే ఏటా సుమారు రూ.11.10 కోట్ల ఆదాయం వస్తోంది. అయినప్పటికీ ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించే ఆలోచనే ఆశాఖకు లేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి పక్కా భవనంతో పాటు వసతులు కల్పించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం**



ప్రత్తిపాడులో ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో వసతులు లేవు. పక్కా భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
– పి.శివకుమార్, ఎక్సైజ్ సీఐ, ప్రత్తిపాడు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం**



గోకవరం: సత్యసాయి తాగునీటి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజలకు తాగునీరు అందివ్వడం, ప్రభుత్వంలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం అనేవి పాలకులు, అధికారుల బాధ్యత అన్నారు. తమకు రావలసిన 19 నెలల జీతాలు చెల్లించాలని కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ఆకలి కేకలు కూటమి ప్రభుత్వానికి, అధికారులకు కనిపించడం లేదని విమర్శించారు. కార్మికుల సమ్మెతో సత్యసాయి నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో భగవాన్ సత్యసాయి చేపట్టిన సత్యసాయి తాగునీటి పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రత్నగిరి క్యాంటీన్‌కు రూ.3.33 లక్షలకు టెండర్ దాఖలు



తొమ్మిది నెలలుగా మూతపడిన మెయిన్ క్యాంటీన్

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో ప్రధాన క్యాంటీన్‌కు నెలకు రూ.3,33,333 హెచ్చు మొత్తంలో టెండర్ కం వేలం దాఖలైంది. తొమ్మిది నెలలుగా ఖరారు కాక మూతపడిన ఈ క్యాంటీన్‌కు ఎనిమిదో విడతగా బుధవారం నిర్వహించిన టెండర్ కం వేలంలో నలుగురు కలిపి దాఖలు చేసిన టెండర్‌ను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పటివరకూ ఏడు సార్లు వేలం నిర్వహించినా సరైన ధర లభించలేదని చివరకు బుధవారం నెలకు హెచ్చు మొత్తానికి వేసిన కొటేషన్‌ను అధికారులు స్వీకరించారు. గతంలో రూ.ఏడు నుంచి రూ.8 లక్షల వరకూ ఖరారయ్యే వేలం రూ.మూడు, నాలుగు లక్షలకే కోట్ చేస్తుండడంతో అధికారులు ఖరారు చేయలేదు. రత్నగిరిపై మరో రెండు క్యాంటీన్లు రావడంతో ఈ క్యాంటీన్‌కు ఆదాయం తగ్గడమే తక్కువకు కోట్ చేస్తుండడంతో అధికారులు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ప్రధాన క్యాంటీన్ పక్కనే ఉన్న డార్మెటరీలో సుమారు మూడు వందల మంది వరకు భక్తులు బస చేస్తుంటారు. రామాలయం వద్ద విశ్రాంతి షెడ్డులో వందల సంఖ్యలో ఉండే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వేలం ఖరారు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం



డి.పోలవరంలో మహిళకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



దానవాయిపేటలో ప్రజలకు చంద్రబాబు మోసంపై కరపత్రాలు అందజేస్తున్న యనమల కృష్ణుడు, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీపై ప్రచారం

తుని రూరల్: సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత ఎప్పుడు నెరవేర్చలేదని, ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ అన్నారు. మండలంలోని డి.పోలవరం, దొండవాక, చేపూరు, రాపాక గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. డి.పోలవరంలో వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా పర్యటించి ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించారు. నాయకులు చిటికెల వరహాలబాబు, అంకంరెడ్డి దొరబాబు, అంకంరెడ్డి పోతురాజు పాల్గొన్నారు.

**పెత్తందార్ల అభివృద్ధి కోసమే చంద్రబాబు తపన**

తొండంగి: సీఎం చంద్రబాబు తపన పెత్తందార్ల అభివృద్ధి కోసం తప్ప పేదల కోసం కాదని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. మండలంలోని కోన ప్రాంతం దానవాయిపేటలో బుధవారం 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలసి దానవాయిపేట, నర్శిపేట తదితర గ్రామాల్లో ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో జరిగిన మోసాన్ని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వెస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్, పార్టీ మండల యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, సర్పంచ్ మడదా తిరుమల కుమారి, మడదా పరమేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

### ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



సిద్ధివారిపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

శంఖవరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ బుధవారం ఆ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. మండలంలోని ఆంధ్రా శబరిమలైగా ప్రసిద్ధి చెందిన సిద్ధివారిపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ, గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, పి.మల్లాపురం సర్పంచ్ గుండు నాగదేవి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పార్టీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ రామిశెట్టి నాని, పార్టీ నాయకులు ఈగల మాణిక్యాలరావు, ఈగల గంగ, మామిడి శ్రీనువాస్, చెంచుబాబు పాల్గొన్నారు.

### రైతులకు మెరుగైన సేవలందించాలి

ప్రత్తిపాడురూరల్: రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని ధర్మవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయించారు. సొసైటీ పరిధిలో రైతులకు అన్నిరకాల సేవలు అందించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, త్రి సభ్య కమిటీ సభ్యుడు చీప్తి నానాజీ, వంపనబోయిన తాతాజీ పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- పిల్లల ఆరోగ్యంపై తల్లులకు అవగాహన

ఏలేశ్వరం: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. పట్టణంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతితల్లి తమ పిల్లలకు ముర్రిపాలు పట్టాలన్నారు. తల్లిపాల ద్వారా పిల్లలకు రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆరోగ్యకరంగా ఉన్న పది మంది పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెంపు**

గండేపల్లి: శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచేందుకు తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మురారీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డ జీవితాంతం పూర్తి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.సురేంద్ర, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది, పిల్లల తల్లులు, మహిళా పోలీస్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### అటవీ గ్రామాల్లో కార్డన్ సెర్చ్

జగ్గంపేట: మండంలోని అటవీ గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక క్విక్ యాక్షన్ టీమ్ సభ్యులు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లిసాల, గోవిందపురం, కృష్ణాపురం, మన్యంవారిపాలెం, భావవరం,నరేంద్రపట్నం గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతాల్లో జంతువులు వేటకు ఏర్పాట్లు చేయడం, గతంలో వన్యమృగాలను వేటాడిన వ్యక్తుల కదలికలు, వన్యప్రాణులను వేటాడిన కేసుల్లోని నిందితుల ఇళ్లను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎవరైనా నాటు తుపాకులు ఉపయోస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జగ్గంపేట ఎస్సై రఘునందనరావు, కిర్లంపూడి ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### తామరాడలో పారిశుధ్య డ్రైవ్

కిర్లంపూడి: మండలంలోని తామరాడలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామ శివారున రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త, పెంట కుప్పలను పొక్లెయిన్‌తో తొలగించారు. గ్రామ సెక్రటరీ పెద్దకాపు పనులను పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ తోట అయ్యన్న సూచించారు.

### తంటికొండ వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

గోకవరం: మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని బుధవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. గ్రామస్తులు, భక్తుల సమక్షంలో హుండీని తెరిచి లెక్కించగా ఆరు నెలల 16 రోజులకు గాను రూ.9,33,861 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో బద్దిరెడ్డి అచ్చన్నదొర, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తుని: విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు స్థానిక బ్రాంచ్ సిబ్బంది, షేర్ హోల్డర్ల పిల్లలకు బ్యాంకు యాజమాన్యం గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 23 మందికి రూ.7,500 చొప్పున చెక్కులు అందజేశారు. బ్యాంకు సేవలు అట్టడుగు వర్గాలకు చేరాలనే ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు బ్యాంకు యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో డైరెక్టర్లు కృష్ణమోహన్, కామరాజు, జగ్గారావు, మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడినట్టు తొండంగి ఎస్సై బి.జగన్మోహన్‌రావు తెలిపారు. కోదాడ గ్రామపంచాయతీ కోదాడ కాలనీకి చెందిన దడాల అబ్బు(56) తన కుమారుడు రాజ్‌కుమార్‌తో కలిసి కాకినాడ ఆస్పత్రికి బైకుపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కత్తిపూడి నుంచి అన్నవరం వైపు జాతీయరహదారిపై వస్తుండగా తమ్మయ్యపేట వద్ద కారు వెనుక నుంచి వచ్చి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్బు తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కాగా రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు తుని ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ అబ్బు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జగన్మోహన్‌రావు వివరించారు.

### ఎరువుల యాజమాన్యం కీలకం

కోటనందూరు: వరిసాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని మండల వ్యవసాయాధికారి, వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కొత్తకొట్టాం, ఎల్లీపేట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నారుమడుల నుంచి పంట చేతికొచ్చే వరకూ తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట వల్ల పైరుకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు సాగు చేసిన పంట వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. పొలం గట్లపై వేసుకునేందుకు కందులు, మినుముల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గారావు, సురేష్, వీఏఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తుని: స్థానిక రాజా గ్రౌండులో జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ బాలురు, బాలికల ఎంపిక నిర్వహించారు. ఆట్యాపాట్యా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ జాబ్స్, కాకినాడ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి సత్యనారాయణరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు విక్టర్‌బాబు, ప్రశాంత్ కుమార్, వరలక్ష్మి, శ్రీనుబాబు, గోపీ, వెంకట్, సతీష్ పాల్గొన్నారు.

### రామస్వామి కుటుంబానికి పరామర్శ

శంఖవరం: ఇటీవల మృతి చెందిన కొంతంగి గ్రామ సర్పంచ్ దూడల రామస్వామి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మరళీకృష్ణంరాజు బుధవారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామస్వామి పార్టీకి అందించిన సేవలు మరవలేనివని కొనియాడారు. పార్టీ మండల కన్వీనర్ నరాలు శ్రీను, ఎంపీటీసీలు చప్పా రాంబాబు, చల్లా సత్యప్రసాద్, పార్టీ నాయకులు గింజాల కొండబాబు, బొల్లు నాగేశ్వరరావు, తూపాటి బాబ్జి, కొప్పిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ



మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో కమలాలు ధరించి ఒక చేయి అభయహస్తంగా, మరో చేతిలో పాశం ధరించి భక్తులకు కనువిందు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు, చండీ పారాయణలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి. గంగాధరబట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రతపురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, ఆలయ అర్చకులు దేవులపల్లి ప్రసాద్ మరో 44 మంది పూజలు నిర్వహించారు.

**అమ్మవారికి సారె సమర్పణ**

జాతర మహోత్సవాల్లో బుధవారం వనదుర్గ అమ్మవారికి స్థానిక వ్యాపారులు వీర్ల సూరిబాబు, చక్రరావు, రాంబాబు సోదరులు సారె సమర్పించారు. మేళతాళాలతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, స్వీట్లు, పండ్లు సమర్పించారు.

**కనకదుర్గ అమ్మవారికి చండీహోమం**

కొండదిగువన తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల సందర్భంగా బుధవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాల సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## జక్కంపూడి కృషితో మెట్ట సస్యశ్యామలం

- ఘనంగా రామ్మోహనరావు జయంతి వేడుకలు
- ఏలేశ్వరంలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



జగ్గంపేటలో జక్కంపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఏలేశ్వరంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కృషితో మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలో బుధవారం జక్కంపూడి జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంత్రిగా జక్కంపూడి రామ్మోహనరావు విశేష సేవలు అందించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడుగా జక్కంపూడి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జువ్విన వీర్రాజు, జువ్విన వీర్రాఘవమ్మ, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, పేకల జాన్, దేగల చంద్రమౌళి, గొడుగు నాగేంద్ర పాల్గొన్నారు.

జగ్గంపేట: మెట్ట ప్రాంతానికి నేడు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు పుష్కలంగా అందుతోందంటే దానికి ప్రధాన కారకులు మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ సీనియర్ నేత అత్తులూరి సాయిబాబా అన్నారు. జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తండ్రి జ్యోతుల రామస్వామి ఆధ్వర్యంలో బుధవారం జక్కంపూడి రామ్మోహనరావు జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత జక్కంపూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంతో పాటు, మెట్ట ప్రాంతానికి జక్కంపూడి ఎంతో మేలు చేశారని తెలిపారు. ప్రధానంగా పుష్కర ఎత్తి పోతల పథకం వల్ల మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందన్నారు. జక్కంపూడి చేసిన మేలుతో ప్రస్తుతం జగ్గంపేట నియోజకవర్గంలో సాగునీటి అవసరాలు తీరి పుష్కలంగా పంటలు పండుతున్నాయని తెలిపారు. జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా మాట్లాడుతూ జక్కంపూడిని నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అప్పారావు కాపు, కంచి లక్ష్మణదొర, జాన్ వెస్లీ, ఉయ్యూరి నాని, దోమల గంగాధర్, నకిరెడ్డి నాగేశ్వరరావు, బుదిరెడ్డి చక్రరావు, లాయర్ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.